

రోడ్లు వేసేదెప్పుడో? 8లో▸
మారుమూల గిరిజన తండాలు, ఆదివాసీ గూడేలకు నేటికీ రోడ్డు సౌకర్యం లేదు. ప్రభుత్వం బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా పనులు ప్రారంభం కాలేదు.



పంటలు కాపాడే చర్యలు చేపట్టాలి
వర్షాలకు దెబ్బతిన్న పంటల రక్షణకు చర్యలు చేపట్టాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న పేర్కొన్నారు. ఇందుకు రైతులకు సహకరించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు సూచించారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
29.0/24.0
ఆకాశం పూర్తిగా మేఘావృతమవుతుంది. పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి

ఆదిలాబాద్‌టౌన్‌: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలని డీఈవో ప్రణీత సూచించారు. ఇన్‌స్పైర్ నామినేషన్లకు సంబంధించి మంగళవారం డీఈవో కార్యాలయం నుంచి జూమ్ ద్వారా ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నామినేషన్ల గడువు ఆగస్టు 31వరకు ఉందని, ప్రతీ పాఠశాల నుంచి ఐదు నమోదు చేయాలని ఆదేశించారు. ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు తమ పాఠశాల పరిధిలోగల విద్యార్థులు మేళాలో పాల్గొనేలా చూడాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి రఘురమణను సంప్రదించాలని సూచించారు. జిల్లా సైన్స్ అధికారి రఘురమణ, రాష్ట్రస్థాయి అధికారి గణేషన్, ఎస్‌సీఈఆర్టీ ప్రొఫెసర్ సురేశ్‌బాబు, రిసోర్స్‌పర్సన్లు భాస్కర్, మనోహర్ రెడ్డి, చంద్రశేఖర్ తదితరులున్నారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలోని వివేకానంద బీఎడ్ కళాశాల ఆవరణలోగల ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రం వద్ద మంగళవారం టీయూపీఎస్ ఆధ్వర్యంలో 'ఉపాధ్యాయ ఉద్యమ జాగరణ' పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీయూపీఎస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ చౌహాన్ మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న 'ఉపాధ్యాయ ఉద్యమ జాగరణ' కార్యక్రమానికి ఉపాధ్యాయులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఇందులో భాగంగా ఆగస్టు 5న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. స్కూల్ కాంప్లెక్స్, మండల, డివిజన్ కేంద్రాల్లో నిరసనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు రాజ్‌కుమార్, బలిరాం, సురేశ్, రాజన్న, రవికుమార్, కృష్ణసాగర్ తదితరులు పాల్గొన్నారు.

'పనివేళల్లో మార్పు సరికాదు'

ఆదిలాబాద్‌టౌన్‌: పాఠశాలల పనివేళల్లో మార్పు సరికాదని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ స్వామి, బీ అశోక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9కి బదులు 9.30 గంటలకు బడులు ప్రారంభించడం అశాస్త్రీయమని తెలిపారు. పనివేళలు మార్చే ముందు నిపుణుల కమిటీ వేయాలని, విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలుసుకోవాలని పేర్కొన్నారు. ఇది కొద్దిమంది ఉపాధ్యాయులకే ప్రయోజనమని, విద్యార్థులకు ఉపయోగపడదని తెలిపారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

ఇంద్రవెల్లి: వానాకాలంలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి నరేందర్‌రాథోడ్ సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023లో భాగంగా మంగళవారం మండలంలోని ముత్నూర్ గ్రామ ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలు, సిబ్బంది పనితీరు, రికార్డులు పరిశీలించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023లో భాగంగా ఆరోగ్యశాఖ చేపట్టాల్సిన పనులు గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పిట్టబొంగరం ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, గ్రామాలను సందర్శించి ప్రజల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతల వివరాలు రోజువారీగా సేకరించి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయ్‌కుమార్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



లక్కారం పాఠశాలను పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి ప్రణీత

ఉట్నూర్‌రూరల్: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి ప్రణీత సూచించారు. మంగళవారం ఉట్నూర్ మండలం పెర్కగూడ ప్రాథమిక పాఠశాల, లక్కారం ఉన్నత పాఠశాల, ఇంద్రవెల్లి మండలంలోని ఉన్నత పాఠశాలను సందర్శించారు. మన ఊరు–మనబడి పనులు త్వరగా పూర్తి చేయాలని డీఈ రమేశ్, కాంట్రాక్టర్లకు సూచించారు. ఆమె వెంట లక్కారం సర్పంచ్ జనార్దన్, సెక్టోరల్ అధికారి జే నారాయణ, సీసీ రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయులున్నారు.



టికెట్ల లొల్లి షురూ..

- సోషల్‌మీడియాలో సర్వే రిపోర్టులు!
- అనుకూలంగా ఉన్నవారు సైలెంట్
- ఫేక్ సర్వే అంటున్న మిగతావారు
- నియోజకవర్గాల్లో వేడెక్కిన రాజకీయం

సాక్షి, ఆదిలాబాద్: ప్రస్తుత వాతావరణం చల్లబడినా జిల్లాలోని రాజకీయ పరిణామాలు మాత్రం వేడెక్కాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆయా పార్టీల్లో టికెట్ల పంచాయితీ మొదలైంది. సోషల్ మీడియాలో సర్వే రిపోర్టులు వెల్లడి కాగా ఆయా నియోజకవర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. సర్వే ఫలితం ఏ పార్టీలో ఎవరికి అనుకూలంగా ఉందని సర్వత్రా చర్చ జరుగుతోంది. కాగా, సర్వే అనుకూలంగా ఉన్న నేతలు సైలెంట్‌గా ఉంటుండగా, మిగతావారు ఫేక్ సర్వే అని కొట్టి పడేస్తున్నారు. మరో పక్క అధికార పార్టీలో ప్రధానంగా బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాలో ఆశావహులు పోటాపోటీగా తమ బలబలాలను ప్రదర్శిస్తున్నారు. అధిష్టానం దృష్టిలో పడేందుకు తీవ్రంగా యత్నిస్తున్నారు.

బోథ్‌లో..



రాథోడ్ బాపురావు, గోడం నగేశ్, సోయం బాపూరావు, అనిల్‌జాదవ్

నియోజకవర్గంలో అధికార పార్టీలో నేతల మధ్య తీవ్రపోటీ నెలకొంది. మొన్నటివరకు సైలెంట్‌గా ఉన్న మాజీ ఎంపీ గోడం నగేశ్ ఇటీవల దూకుడు పెంచారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ పార్టీ కార్యక్రమాల నిర్వహణలో ముందుంటున్నారు. ఆయన వెంట తాంసి, భీంపూర్ జెడ్పీటీసీలు తాటిపెల్లి రాజు, కుమ్ర సుధాకర్, బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ ఉంటున్నారు. ఇటీవల తన బర్త్‌డే వేడుకలతో హంగామా చేసిన నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్‌జాదవ్ కూడా తన అనుచరులతో కలిసి నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల నిర్వహణలో ముందుంటున్నారు. ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ప్రభుత్వ పథకాల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. ఇక.. బీజేపీలో సాకటి దశరథ్, బలరాం జాదవ్ టికెట్ ఆశిస్తూ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు బోథ్ నియోజకవర్గం పైనే ఫోకస్ పెట్టారు. ప్రధానంగా ఆయన ఈ నియోజకవర్గంలో జరిగే పార్టీ కార్యక్రమాలకు హాజరవుతున్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని చూస్తున్నారు. కాంగ్రెస్ నుంచి నేతలు నరేశ్‌జాదవ్, ఆడె గజేందర్, వన్నెల అశోక్‌తో పాటు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు రాథోడ్ పార్వతి టికెట్ ఆశిస్తున్నారు.

ఆదిలాబాద్‌లో..



జోగు రామన్న, పాయల్ శంకర్, సుహాసినిరెడ్డి



సాజిద్‌ఖాన్, గండ్రత్ సుజాత, కంది శ్రీనివాసరెడ్డి

ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే జోగు రామన్న మరోసారి బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. ఇక్కడి నుంచి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రంగినేని మనీషా టికెట్ ఆశిస్తున్నారు. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యే జోగు రామన్న నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ పార్టీ కార్యక్రమాల నిర్వహణలోనూ ముందుంటున్నారు. అధిష్టానం ఆశీస్సులు తనవైపే ఉన్నాయన్న భరోసాతో ఉన్నారు. ఇక.. కాంగ్రెస్‌లో సర్వేల అలజడి నెలకొంది. ఆదిలాబాద్ నుంచి కంది శ్రీనివాస్‌రెడ్డి, గండ్రత్ సుజాతతోపాటు అనూహ్యంగా భార్గవ్ దేశ్‌పాండే పేరు వినిపిస్తుండడం గమనార్హం. టికెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ కొద్దిరోజులుగా హైదరాబాద్‌లో మకాం వేశారు. ప్రధానంగా పార్టీ చేపట్టిన సర్వే వేటిని ప్రామాణికంగా తీసుకున్నారనే విషయంపై కొంతమంది రాష్ట్ర నేతలను కలిసి అసంతృప్తి వ్యక్తంజేశారు. ఇటీవల హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారులతో జరిగిన సమావేశంలోనూ సాజిద్‌ఖాన్ పాల్గొన్నారు. ఈ పరిణామాలన్నీ ఆదిలాబాద్ కాంగ్రెస్‌లో ఆసక్తి కలిగిస్తున్నాయి. బీజేపీలో జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ చిట్యాల సుహాసినిరెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. ఇటీవల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి ఎన్నికైన తర్వాత తమకు అనువుగా పరిస్థితులను మార్చుకునేందుకు ఇద్దరు నేతలు యత్నిస్తున్నారు.

ఆసిఫాబాద్‌లో..



ఆత్రం సక్కు, కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ నుంచి అధికార బీఆర్‌ఎస్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు టికెట్ ఆశిస్తున్నారు. అలాగే జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి కూడా టికెట్ రేసులో ఉన్నారు.

ఖానాపూర్‌లో..



రేఖానాయక్, రాథోడ్ రమేశ్, చారులత, శ్యామ్‌నాయక్, జాన్సన్‌నాయక్, శర్వన్‌నాయక్

ఖానాపూర్ నియోజకవర్గంలో రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. అధికార పార్టీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్ మరోసారి టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. రవాణాశాఖలో పని చేస్తూ స్వచ్ఛంద విరమణ పొందిన శ్యాంనాయక్‌తోపాటు శర్వన్ కూడా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. మరోవైపు అధిష్టానం ఆశీస్సులు తనకూ ఉన్నాయని జాన్సన్ నాయక్ పార్టీ కార్యక్రమాల నిర్వహణలో ముందుంటున్నారు. బీజేపీ నుంచి రాథోడ్ రమేశ్ టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. ఇక.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆశీస్సులతో పార్టీ కార్యక్రమాల నిర్వహణ విషయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు ముందుంటున్నారు. గతంలో మహేశ్వర్‌రెడ్డి అనుచరులుగా ఉన్న చారులత ప్రస్తుతం ప్రేమ్‌సాగర్‌రావు వర్గంగా కొనసాగుతున్నారు. ఈ నియోజకవర్గం నుంచి భరత్ చౌహాన్ కూడా రేసులో ఉన్నారు.

'పరిహారం ఇచ్చేవరకూ ఉద్యమం'



దెబ్బతిన్న పంటలు పరిశీలిస్తున్న పాయల్ శంకర్

జైనథ్: వరదల కారణంగా పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ఇచ్చేదాకా ఉద్యమిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఆనంద్‌పూర్, దీపాయిగూడ, కూర, కరంజి తదితర గ్రామాల్లో పర్యటించి వరదనీటికి దెబ్బ తిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెన్‌గంగ బ్యాక్ వాటర్‌తో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని చెప్పారు. అధికారులు వెంటనే సర్వే నిర్వహించి బాధిత రైతులకు పరిహారం అందేలా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన ఫసల్ బీమాను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడంతో ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రైతులు నష్టపోవాల్సి వస్తోందని తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు కట్కం రాందాస్, నాయకులు లోక కరుణాకర్‌రెడ్డి, ముకుంద్‌రావ్, రాంరెడ్డి తదితరులున్నారు.

జాలువారుతున్న 'గుత్పాల'



జలధారలతో ఆకట్టుకుంటున్న గుత్పాల జలపాతం

నేరడిగొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని గుత్పాల జలపాతం జలకళ సంతరించుకుంది. భారీగా వరద నీరు చేరగా జలపాతం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. దేవుల్‌నాయక్ తండా జాతీయ రహదారి నుంచి అర కిలోమీటర్ దూరంలోని జలపాతం వద్దకు వచ్చిన ప్రకృతి ప్రేమికులు ఆహ్లాదాన్ని పొందుతున్నారు. మంగళవారం జలపాతం జలధారలతో మంత్రముగ్ధులను చేసింది.

మెరుగైన సేవలందించాలి



ఈడీ వినోద్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న ఆర్టీసీ అధికారులు

ఆదిలాబాద్: ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) సీ వినోద్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆదిలాబాద్ డిపోను పరిశీలించారు. ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆదిలాబాద్ డిపో పరిధిలో జూన్‌లో అత్యధిక ఆదాయం తీసుకువచ్చేందుకు కృషి చేసిన డ్రైవర్లు, కండక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ సోలోమన్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ సురేశ్‌చౌహాన్, డిపో మేనేజర్ కల్పన తదితరులున్నారు.

ఆగస్టు 11నుంచి ఎస్డీఎల్సీఈ పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్‌: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎస్డీఎల్సీఈ డిగ్రీ పరీక్షలు ఆగస్టు 11వ తేదీ నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కాకతీయ విశ్వవిద్యాలయం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విషయాన్ని అభ్యర్థులు గమనించాలని కోరారు.

ఆదివాసీలకు రక్షణ కల్పించాలి



నినదిస్తున్న టీఏజీఎస్ నాయకులు

ఎదులాపురం: ఆదివాసీలకు రక్షణ కల్పించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న అకృత్యాలను వ్యతిరేకిస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి కుమ్రంభీమ్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా, సేవ్ మణిపూర్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సచిన్ మాట్లాడుతూ.. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని దాడులు ఆపాలని, లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొడసం భీంరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు లంకా రాఘవులు, బైరి సోమేశ్, ఉయిక విష్ణు, ఆత్రం కిష్టన్న, నాయకులు మడావి నాగోరావ్, కోవ సునీల్, మహేశ్, దీపక్, ఆదివాసీ విద్యార్థులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన దేశానికే సిగ్గుచేటు
మణిపూర్ ఘటన దేశానికే సిగ్గు చేటని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట గల పాత జాతీయ రహదారిపై మంగళవారం రాస్తారోకో చేశారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికైనా ప్రభుత్వాలు కల్పించుకుని ఆదివాసీలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు ముడుపు నళినీరెడ్డి, సీపీఐ, సీపీఎం నాయకులు కుంటాల రాములు, ఎస్.అరుణ్‌కుమార్, లంకా రాఘవులు, బండి దత్తాత్రి, జమున తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



ఆనంద్‌పూర్‌లో నాయకులతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

జైనథ్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంత సాధ్యమని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే జోగు రామన్న సూచించారు. మంగళవారం మండలంలోని ఆనంద్‌పూర్, పిప్పర్‌వాడ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సవారీ బంగ్లా షెడ్ల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామస్తులు డప్పు చప్పుళ్ల మధ్య ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామస్తులతో కలిసి నృత్యం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రూ.కోట్లు వెచ్చించి సవారీ షెడ్లు నిర్మించినట్లు తెలిపారు. పీరీల పండుగ మత సామరస్యానికి నిదర్శనమని, మతాలకు అతీతంగా ప్రజలు ఈ పండుగను జరుపుకొంటున్నట్లు చెప్పారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, నాయకులు సర్పన్ లింగారెడ్డి, తుమ్మల వెంకట్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆస్పత్రిని పరిశీలిస్తున్న కుమ్ర బాలు

నార్నూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఏజెన్సీ అదనపు జిల్లా వైద్యాధికారి కుమ్ర బాలు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. వస్తువులు సరిగా పెట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులు, సిబ్బంది హాజరు వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెండు బృందాలతో గ్రామాల్లో ర్యాపిడ్ ఫీవర్ సర్వే శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు రెండు మలేరియా, ఐదు డెంగీ కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. ఐటీడీఏ పీవో సహకారంతో హైరిస్క్ గ్రామాలను గుర్తించి గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడకుండా, గ్రామస్థాయిలో ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యుడు రాంబాబు, హెచ్‌ఈ నాందేవ్ చౌహాన్, తులసీదాస్ రాథోడ్ తదితరులున్నారు.

ఆదివాసీల హక్కులు కాపాడాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ సోయం

ఆదిలాబాద్: ఆదివాసీల రాజ్యాంగబద్ధ హక్కులను సంరక్షించాలని ఎంపీ సోయం బాపూరావు కోరారు. మంగళవారం ఆదివాసీ నాయకులతో కలిసి ఢిల్లీలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్‌ను కలిశారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాపూరావు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలోని ఉద్యోగాలు ఆదివాసీలకు దక్కేలా విడుదలైన జీవో నంబర్ 3కు సంబంధించిన కేసుపై సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసినట్లు చెప్పారు. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం చొరవ చూపి కౌంటర్ దాఖలు చేయాలని కోరారు. ఆయన వెంట ఆదివాసీ ప్రతినిధి బృందం నాయకులు రామకృష్ణ, సీతారాములు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

27, 28తేదీల్లో న్యాక్ బృందం పర్యటన

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలను ఈనెల 27, 28 తేదీల్లో జాతీయ అంచనాలు, ప్రమాణాల సంస్థ (న్యాక్) బృందం సందర్శించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జలగం అనిత, కోఆర్డినేటర్ షేక్ ముజీబ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బృందంలో బనారస్ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆచార్యులు రాజ్‌కుమార్ అధ్యక్షుడిగా, తుంకూర్ విశ్వవిద్యాలయం ఆర్థికశాఖ పరిశోధనాచార్యులు సమన్వయ సభ్యుడిగా, లయోల కళాశాల ప్రిన్సిపాల్ జేవీఆర్ వేదం సభ్యుడిగా వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలోని కోర్సులు, బోధన సౌకర్యాలు, మౌలిక వసతులు, పరిశోధన, విద్యార్థుల విజయాలు, గ్రంథాలయం, ప్రయోగశాలలు, క్రీడా సౌకర్యాలు, పరీక్షా ఫలితాలు తదితర అంశాలను పరిశీలించి గ్రేడ్ కేటాయించనున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ విద్య బలోపేతానికి చర్యలు

కైలాస్‌నగర్: అంగన్‌వాడీ విద్యను బలోపేతం చేసేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీ నుంచి 'పోషణ్ భీ పడాయి భీ' కార్యక్రమ అమలుపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ అంశాలపై జాతీయ మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న విద్య, పోషకాహారం, సిబ్బంది, కార్యకర్తల శిక్షణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పోషకాహారం అందిస్తున్నట్లు చెప్పారు. సాధారణ ప్రసవాల సంఖ్య పెంపు, మాతా, శిశు మరణాల నియంత్రణకు మహిళా, శిశు సంక్షేమ, వైద్య, ఆరోగ్యశాఖ సమన్వయంతో చర్యలు చేపట్టామని వివరించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారి మిల్కా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి కార్మిక సమాఖ్య సమావేశానికి జిల్లా వాసి

నిర్మల్‌ ఖిల్లా: జాతీయస్థాయి కార్మిక సంఘాల సమాఖ్య సమావేశానికి నిర్మల్‌ జిల్లాకు చెందిన పరికిపండ్లస్వదేశ్‌కు ఆహ్వానం లభించింది. ఈనెల 26, 27 తేదీల్లో చెన్నైలో నిర్వహించనున్న జాతీయస్థాయి సమావేశానికి తెలంగాణకు చెందిన ఇద్దరు కార్మిక సంఘాల నాయకులకు ఆహ్వానం అందింది. ఇందులో నిర్మల్‌ జిల్లాకు చెందిన ప్రవాసమిత్ర లేబర్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు పరికిపండ్లస్వదేశ్‌తో పాటు, కరీంనగర్‌ జిల్లా అధ్యక్షురాలు బూత్కూరి కాంతా ఉన్నారు. స్విట్జర్లాండ్‌ రాజధాని జెనీవా కేంద్రంగా పనిచేస్తున్న బిల్డింగ్‌ అండ్‌ వుడ్‌ వర్కర్స్‌ ఇంటర్నేషనల్‌ (బీడబ్ల్యూఐ) అనే గ్లోబల్‌ యూనియన్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో జరిగే ఈ జాతీయ సమావేశానికి ఇద్దరు కార్మిక సంఘాల నాయకులను నామినేట్‌ చేసింది. వీరు గల్ఫ్‌ దేశాలలో వలస కార్మికుల సమస్యలు, జాతీయ అంతర్జాతీయ వలసలు, నిర్బంధ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, లింగసమానత్వం తదితర అంశాలపై ప్రసంగించనున్నారు. క్షేత్రస్థాయిలో వలస భవన నిర్మాణ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను నివేదిక రూపంలో బీడబ్ల్యూఐ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు స్వదేశ్‌ చెప్పారు.

ముగ్గురు మట్కా జూదరుల అరెస్టు



పోలీసుల అదుపులో మట్కా జూదరులు

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలోని తాంసి బస్టాండ్‌ ప్రాంతంలో మట్కా జూదరులను సీసీఎస్‌ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సమాచారం మేరకు సీసీఎస్‌ పోలీసులు దాడులు చేసి ముగ్గురు మట్కా జూదరులను పట్టుకున్నారు. మట్కా నిర్వహిస్తున్న బొక్కల్‌గూడకు చెందిన వసీమ్‌, మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన కనక సంతోష్‌, ఆదిలాబాద్‌ పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన షేక్‌ ఖలీల్‌లను అరెస్టు చేశారు. వీరి నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ.4530 నగదుతో పాటు మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్‌ పోలీసు స్టేషన్‌లో వీరిని అప్పగించగా, ఎస్సై అశోక్‌ కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్‌: ఆదిలాబాద్‌ పట్టణంలోని లారీ అసోసియేషన్‌ సమీపంలో పేకాటాడుతున్న ఆరుగురిని స్పెషల్‌ బ్రాంచ్‌ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. మేరకు స్పెషల్‌ బ్రాంచ్‌ సీఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి దాడులు చేయగా ఆరుగురు నిందితులు పట్టుబడ్డారు. వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్‌లతో పాటు రూ. 10,470 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. వారిపై కేసు నమోదు చేసి చేసినట్లు తెలిపారు.

ఇద్దరు దొంగల రిమాండ్‌

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలో రెండురోజుల కిందట చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను వన్‌టౌన్‌ పోలీసులు అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. వన్‌టౌన్‌ ఎస్సై జి.నారాయణ వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి 10గంటల సమయంలో బజారియ ట్రాన్స్‌పోర్టులో చోరీ జరిగింది. ఆ సమయంలో యజమాని షెట్టర్‌ వేసి ఇంటికి వెళ్లగా 12గంటల సమయంలో అక్కడ పనిచేసే కార్మికుడు వచ్చి షెట్టర్‌ తీశాడు. అందులో నలుగురు దొంగలు కనిపించగా కత్తితో అతడిని బెదిరించి కౌంటర్‌ నుంచి రూ.45వేలను తీసుకుని పరారయ్యారు. ఇందులో ఒకరు మడా రతన్‌, మరో మైనర్‌ బాలుడు ఉన్నారు. వీరిద్దరిని అరెస్టు చేయగా మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు వివరించారు.

విద్యుత్‌ షాక్‌తో గేదె మృతి



మృతి చెందిన గేదె

ఆదిలాబాద్‌రూరల్‌: మండలంలోని అర్లి (బి) గ్రామానికి చెందిన రైతు బుక్క రవీందర్‌కు చెందిన గేదె విద్యుత్‌ షాక్‌తో మృతి చెందింది. వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే సోమవారం గేదె పశువుల మందలో మేతకు వెళ్లింది. నిషాన్‌ఘాట్‌ శివారు ప్రాంతంలో విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ నేలకు రెండు ఫీట్ల ఎత్తులో ఉండడంతో అది తగిలి విద్యుత్‌ షాక్‌ గురై అక్కడిఅక్కడే మృతి చెందింది. దాని విలువ రూ.50వేల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు. ఈ విషయాన్ని పశు వైద్య శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

రోడ్లు వేసేదెప్పుడో..?

- గిరి గూడేలకు, తండాల బీటీ రోడ్లకు రూ.42 కోట్లు
- 2022 నవంబర్‌ 14న నిధులు మంజూరు చేసిన గిరిజన సంక్షేమశాఖ
- ఎనిమిది నెలలు గడుస్తున్నా ప్రారంభం కాని పనులు
- గిరిజనుల దారి కష్టాలు యథాతథం



మాన్కపూర్‌ గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి



గిరిజాయి గ్రామ సమీపంలో వాగు దాటుతున్న గిరిజనులు

బజార్‌హత్నూర్‌: జిల్లాలో మారుమూల అటవీ ప్రాంతాల్లోని గిరిజన గూడేలు, తండాలకు రవాణా సౌకర్యాలు మెరుగుపరుచుటకు బీటీ రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ద్వారా బోథ్‌ నియోజకవర్గంలోని 40 రోడ్ల నిర్మాణానికి రూ.42.29 కోట్లు నిధులను మంజూరు చేసింది. అయితే 8 నెలలు గడుస్తున్న ఏ గ్రామానికి రోడ్డు నిర్మాణం పనులు చేపట్టలేదు. వేసవి కాలం దాటిన పనులు ప్రారంభం కాకపోవడంతో గిరిజనుల దారి కష్టాలు మరో ఏడాది భరించక తప్పేపరిస్థితి కనబడటం లేదు.

రోడ్ల నిర్మాణంలో జాప్యం ఎందుకో...

బోథ్‌ నియోజకవర్గంలోని గిరిజన గూడేలకు, తండాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైన టెండర్ల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. జిల్లాలోని అటవి ప్రాంతాలకు ఆనుకొని ఉన్న గిరిజనగూడేలు, తండాలు దశాబ్దాల క్రితమే ఏర్పడిన ఇప్పటివరకు ఎలాంటి రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు విద్య, వైద్యానికి దూరమవుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే ఈ గిరిజన గ్రామాలకు సైకిల్‌ కూడా వెళ్లలేని పరిస్థితి. 2022 నవంబర్‌లో బోథ్‌ ఎమ్మెల్యే రాథోడ్‌ బాపురావ్‌ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను కలిసి మారుమూల ప్రాంత గిరిజనుల దుస్థితిని విన్నవించారు. దీంతో బోథ్‌ నియోజకవర్గంలోని 7 పాత మండలాల పరిధిలోని గిరిజన గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అందులో బోథ్‌ మండలంలోని నాలుగు రోడ్ల నిర్మాణానికి రూ.3.9కోట్లు, బజార్‌హత్నూర్‌ మండలంలో 5 రోడ్లకు రూ.7.14కోట్లు, ఇచ్చోడ మండలంలోని 9 రోడ్లకు రూ.6.38 కోట్లు, నేరడిగొండ మండలంలోని 9 రోడ్లకు రూ.5.72 కోట్లు, తాంసి మండలంలోని 5 రోడ్లకు రూ.6.72 కోట్లు, తలమడుగు మండలంలోని మూడు రోడ్లకు రూ.8.48 కోట్లు, గుడిహత్నూర్‌ మండలంలోని 5 రోడ్లకు రూ.3.95 కోట్లు మొత్తం 7 మండలాల పరిధిలోని 62 గ్రామాలకు 40బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.42.29 కోట్ల నిధులు మంజూరు చేశారు. దీంతో ఆ సమయంలో సంబంధిత గ్రామాల గిరిజనులు ఆనందం వ్యక్తం చేశారు. కానీ అధికారుల నిర్లక్ష్యమో, గిరిజనుల దురదృష్టమో ఏమో కాని ఎనిమిది నెలలు గడుస్తున్నా ఎక్కడ రోడ్డు నిర్మాణం జరగలేదు.

వర్షాకాలం గిరిజనులకు కష్టకాలమే...

ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో గిరిజన గ్రామాల నుంచి మండల కేంద్రాలకు చేరుకునే పరిస్థితి లేదు. వర్షాలకు వాగులు వంకలు పొంగి పొర్లడం, దారులన్నీ బురదమయం కావడంతో గిరిజనులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్ల సౌకర్యం లేక ఎవరైన అనారోగ్యం బారినపడితే చెట్ల పసర్లే దిక్కు. అత్యవసర పరిస్థితిలో రోగులను ఆసుపత్రికి తీసుకువెళ్లాలన్నా అంబులెన్సు, ఇతర వాహనాలు ఆ గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి. గర్బిణులు ఆస్పత్రికి వెళ్లాలన్నా ఎడ్ల బండ్లే దిక్కు. చదువుకోవడానికి విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లలేని దుస్థితి.

కలగానే రోడ్డు నిర్మాణం..



మా గ్రామం ఏర్పడి ఐదు దశాబ్దాలు గడుస్తున్నా ఇప్పటికీ రోడ్డు నిర్మాణం జరగలేదు. మా గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లాలంటే 12 కిలో మీటర్లు బురదలో నడవాల్సిందే. వర్షాకాలం గ్రామ సమీపంలో కడెం వాగు దాటాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని దాటాల్సిన పరిస్థితి. ఎన్ని ప్రభుత్వాలు వచ్చిన మా దారి కష్టాలు తీరడం లేదు.

– కుమ్ర సంగీత, సర్పంచ్‌, గిరిజాయి

టెండరు ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తాం

బోథ్‌ నియోజకవర్గంలోని గిరిజన గూడేలకు, తండాలకు గిరిజన సంక్షేమ శాఖ ద్వారా రూ.42.29 కోట్లు నిధులు మంజూరైనప్పటికీ టెండర్లు పూర్తి కాలేదు. కొన్ని రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అడ్డంకులు ఏర్పడ్డాయి. అటవీశాఖ నుంచి అనుమతులు లభించిన తర్వాత టెండరు ప్రక్రియ పూర్తి చేస్తాం. రోడ్ల నిర్మాణాలు వర్షాకాలం ముగిసిన తర్వాత ప్రారంభించనున్నాం.

– సంతోష్‌ డీఈ, ఐటీడీఏ, ఉట్నూర్‌

మీ సేవ నిర్వాహకులపై విచారణ



విచారణ చేపడుతున్న అధికారులు

గుడిహత్నూర్‌: మండలంలోని మన్నూర్‌ మీసేవాకు చెందిన స్టేషనరీపై మండల కేంద్రంలోని ఆన్‌లైన్‌ సెంటర్‌ నిర్వాహకుడు నకిలీ కుల ధృవీకరణ పత్రం తయారు చేసి ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ సంఘటన పై తహసీల్దార్‌ సంధ్యారాణి పోలీసులకు, మీసేవ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం మీసేవ ఈ డీఎం బండి రవి, తహసీల్దార్‌ సంధ్యారాణి సమక్షంలో విచారణ చేపట్టారు. నకిలీ ధృవీకరణ పత్రం స్టేషనరీ మన్నూర్‌ మీ సేవ కేంద్రానికి కేటాయించడం జరిగిందని నిర్ధారించారు. దీనిపై గుడిహత్నూర్‌ ఆన్‌లైన్‌ సెంటర్‌లో ఎలా ప్రింట్‌ చేశారని వాకబు చేశారు. సదరు మీ సేవా కేంద్రానికి ఉన్న లాగిన్‌ వివరాలు సేకరించారు. దీంతో పాటు గుడిహత్నూర్‌ మీ సేవా కేంద్రానికి సంబంధిచి కొన్ని ఫిర్యాదులు ఉన్నాయని నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లారు. మీ సేవా నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సీఎస్‌సీ సెంటర్ల నిర్వాహకులు సైతం హద్దులు మీరి వ్యవహరించవద్దని హెచ్చరించారు. పూర్తి విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదించడం జరుగుతుందని తెలిపారు. విచారణలో టీఎస్‌టీసీఎస్‌ డీఎం నర్సింహారావ్‌, ఈ సేవా జిల్లా కోఆర్డినేటర్‌ ఠాకూర్‌ రఘువీర్‌ సింగ్‌ ఉన్నారు.

గంగానదిలో మాజీ మంత్రి అస్తికలు



కాశీలో పూజలు నిర్వహిస్తున్న సంజీవ్‌ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్‌: ఇటీవల మృతిచెందిన మాజీ మంత్రి, కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకులు సి.రాంచంద్రారెడ్డి అస్తికలను మంగళవారం ఆయన అల్లుడు, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ సంజీవ్‌రెడ్డి కాశీలోని గంగానదిలో వదిలారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రత్యేక పూజలు జరిపారు.

విద్యార్థుల సర్కస్‌ ఫీట్లు



దారిలో ఏర్పాటు చేసిన గ్రీల్స్‌ను పట్టుకొని పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు సర్కస్‌ ఫీట్లు తప్పడం లేదు. మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి పాఠశాల వెళ్లేదారిలో వర్షం నీటితో నిండిపోయింది. ప్రధానగేటు నుంచి పాఠశాల వరకు దాదాపుగా ఐదు వందల మీటర్ల పొడవున మోకాలిలోతు నీరు నిలిచి ఉండడంతో విద్యార్థులకు సర్కస్‌ ఫీట్లు తప్పడం లేదు. దారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన ఇనుపగ్రీల్స్‌ను పట్టుకొని పాఠశాలకు చేరుకుంటున్నారు. మరికొందరు మోకాల్లోతు నీటిలో నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

పాత తహసీల్దార్‌ కార్యాలయంలో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదంలో కాలిపోతున్న సామగ్రి



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నిర్మల్‌టౌన్‌: జిల్లా కేంద్రంలోని పాత తహసీల్దార్‌ కార్యాలయంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళ్తే.. ఇందులోని తహసీల్‌ కార్యాలయాన్ని ఆర్డీవో ఆఫీస్‌కి తరలించారు. ఈ భవనాన్ని మున్సిపల్‌కు అప్పగించారు. అయితే ఇక్కడ సమీకత మార్కెట్‌ను నియమించడానికి మున్సిపల్‌ అధికారులు బిల్డింగ్‌ కూల్చివేత పనులను ప్రారంభించారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కార్యాలయం నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన చుట్టుపక్కల వారు సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. కార్యాలయంలోని పనికి రాని రికార్డ్స్‌, ఫర్నీచర్‌ పూర్తిగా దగ్ధమైంది. దీనికి సంబంధించిన వివరాలను సంబంధిత తహసీల్దార్‌ సుభాష్‌ను సంప్రదించగా మా ఆఫీస్‌ కు సంబంధించిన పూర్తి రికార్డులను తీసుకున్న తర్వాత, మున్సిపల్‌శాఖకు అప్పజెప్పడం జరిగిందని, ఈ అగ్ని ప్రమాదంలో ఎలాంటి రికార్డులు కాలిపోలేవని, మా రికా ర్డులు భద్రంగానే ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విషయంపై మున్సిపల్‌ డీఈని సంప్రదించగా.. బిల్డింగ్‌కు సంబంధించిన ఐరన్‌ రాడ్‌లను గ్యాస్‌ కట్టర్‌తో కట్‌ చేస్తుండగా చిన్నచిన్న నిప్పు రవ్వలతో అగ్ని ప్రమాదం సంభవించినట్లు తెలిపారు. దీంతో ఎటువంటి నష్టం వాటిల్లలేదన్నారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం బిల్డింగ్‌ను జేసీబీతో కూల్చివేశారు.

స్తంభం పైనుంచి పడి లైన్‌మన్‌కు గాయాలు

తాంసి: విద్యుత్‌ స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి లైన్‌మన్‌ తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని అర్లి(టి) సబ్‌స్టేషన్‌ పరిధిలో లైన్‌మెన్‌గా దినేష్‌ విధులు నిర్వహిస్తున్నాడు. దినేష్‌ గోవింద్‌పూర్‌ గ్రామ శివారులో విద్యుత్‌ స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా జారి పడ్డాడు. దీంతో చేతికి, కాళ్లకు గాయాలయ్యాయి. వెంటనే గ్రామస్తులు చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు.

రెండు గేదెల చోరీ

తానూరు: మండలంలోని బోంద్రట్‌ గ్రామంలో ఓ రైతుకు చెందిన రెండు గేదెలు చోరీకి గురైనట్లు ఎస్సై జె.రాహుల్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... బోంద్రట్‌ గ్రామానికి చెందిన రైతు సోన్‌ఖేడ్‌ సురేశ్‌ ఈ నెల 23వ తేదీన రాత్రి నాలుగు గేదెలను తన పెరటిలో కట్టివేసి ఇంటికి వెళ్లాడు. 24వ తేదీన రెండు గేదెలు కనిపించకుండా పోయాయి. ఎంత వెతికినా ఆచూకీ కనిపించకపోవడంతో మంగళవారం సాయంత్రం ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బిడ్డపై మురిపెం తీరకముందే..

- రిమ్స్‌లో బాలింత మృతి
- కన్నీరుమున్నీరైన కుటుంబీకులు



మృతిచెందిన బాలింత



పుట్టిన బిడ్డతో కుటుంబీకులు

ఆదిలాబాద్‌టౌన్‌/ఇంద్రవెల్లి: నవమాసాలు మోసి.. పురుటినొప్పులతో తల్లడిల్లి పండంటి బిడ్డకు జన్మనిచ్చిన ఓ తల్లి ఆ బిడ్డ మురిపెం చూడకుండానే అనంత లోకాలకు పయనమైన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. పెళ్లయిన రెండేళ్ల తర్వాత గర్భం దాల్చడంతో తల్లి గారి, అత్తవారింట్లో సంతోషాలు వ్యక్తమయ్యాయి. తొమ్మిది నెలలు నిండడంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌ ఆస్పత్రిలో రెండు రోజుల క్రితం ప్రసవం కోసం చేర్పించారు. మంగళవారం ఉదయం మగబిడ్డకు జన్మినిచ్చిన కొన్ని గంటల్లోనే మృత్యువాత పడడంతో ఆనందంగా కాస్తా ఆవిరైపోయింది. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నెలకొంది. కుటుంబీకులు కన్నీరుమున్నీరవుతూ పుట్టిన బిడ్డను చూసి విలపించారు.

సాధారణ కాన్పు అయినప్పటికీ..

ఇంద్రవెల్లి మండలం మర్కగూడకు చెందిన గైక్వాడ్‌ అశోక్‌-రంజన దంపతుల నాలుగో సంతానం సొనాలి కాంబ్లే (22) రెండేళ్ల క్రితం నార్నూర్‌ మండలంలోని బొప్పపూర్‌ గ్రామానికి చెందిన నానేశ్వర్‌తో వివాహమైంది. కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. గర్భం దాల్చిన తర్వాత ప్రసవం కోసం తల్లిగారి ఇంటికి వచ్చింది. పురుటినొప్పులు రావడంతో ఆదివారం కుటుంబీకులు రిమ్స్‌ ఆస్పత్రికి తీసుకొచ్చారు. మంగళవారం ఉదయం 5.30 గంటల సమయంలో సాధారణ కాన్పు ద్వారా ప్రసవం జరిగింది. మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆ సమయంలో ఆమె ఆరోగ్యంగానే ఉందని కుటుంబీకులు, వైద్యులు తెలిపారు. అయితే మంగళవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల సమయంలో సొనాలికి ఫిట్స్‌ వచ్చినట్లు చెప్పారు. ఆ సమయంలో ఇద్దరు వైద్యులతో పాటు జూనియర్‌ డాక్టర్లు అందుబాటులో ఉన్నారు. చికిత్స అందిస్తున్న సమయంలోనే పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో రిమ్స్‌ డైరెక్టర్‌ జైసింగ్‌ రాథోడ్‌ డ్యూటీలో ఉన్న ఇద్దరు అసిస్టెంట్‌ ప్రొఫెసర్లు, జూనియర్‌ డాక్టర్లను పిలిచి బాలింత మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అమియోట్రిక్‌ ఫ్లూయిడ్‌ ఎంబాలిజం (ఊపిరితిత్తుల సమస్య)తో మృతిచెంది ఉండొచ్చని వైద్యులు తెలిపారు.

మాతృత్వపు అనుభూతి పొందకుండానే..



సొనాలి కాంబ్లే (ఫైల్‌)

నవ మాసాలు మోసిన తర్వాత మాతృత్వపు అనుభూతి పొందకుండానే కాటికి వెళ్లింది. బిడ్డ ఆలనాపాలన, తల్లి ప్రేమకు దూరమయ్యాడు. తల్లిదండ్రులు తమ కూతురుకు సంతానమైందన్న ఆనందం అంతలోనే ఆవిరైంది. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబీకులతో పాటు బంధువుల రోదనలు మిన్నంటాయి. చిన్నారిని చూస్తూ కంటతడి పెట్టిన తీరు అందరిని కలచివేసింది.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ ఉద్యోగులు



బ్యాగు అందిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, ఎస్సై

ఆదిలాబాద్‌: ఆదిలాబాద్‌ ఆర్టీసీ ఉద్యోగులు తమ నిజాయితీని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే ఆదిలాబాద్‌ ఆర్టీసీ డిపో నుంచి మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు సూపర్‌ లగ్జరీ సర్వీస్‌ హైదరాబాద్‌కు బయలుదేరింది. నిర్మల్‌లో మల్లెబోయిన శివ అనే ప్రయాణికుడు బస్సులోనికి ఎక్కాడు. హైదరాబాద్‌ సుచిత్ర బస్సు స్టాప్‌ వద్ద తన బ్యాగును బస్సులోనే మర్చిపోయి దిగిపోయాడు. బస్సు ఎంజీబీఎస్‌ బస్‌ స్టేషన్‌కు చేరుకున్న అనంతరం బస్సులో బ్యాగును గుర్తించిన ఆదిలాబాద్‌ డిపో డ్రైవర్‌ అర్జున్‌, కండక్టర్‌ రాజులు ఎంజీబీఎస్‌ స్టేషన్‌ ఎస్సై హనుమంతుకు వివరాలను తెలియజేశారు. ప్రయాణికుని వివరాలను సేకరించిన అనంతరం ఆయనకు బ్యాగును అందజేశారు. బ్యాగులో రెండు లక్షల విలువ గల రెండు ల్యాప్‌ టాప్‌లు ఉన్నాయని, ఆర్టీసీ ఉద్యోగులు నిజాయితీతో బ్యాగును అప్పగించడంపై ప్రయాణికుడు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో హెడ్‌ కానిస్టేబుల్‌ యశ్వంత్‌, కానిస్టేబుల్‌ ఆర్‌ విఎస్‌ నాయక్‌ తదితరులున్నారు.

సాత్నాల రెండు గేట్లు ఎత్తివేత



జైనథ్‌: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని సాత్నాల ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో మంగళవారం అధికారులు రెండు గేట్లు ఎత్తారు. సుమారుగా 3500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండటంతో మధ్యాహ్నం వరకు రెండు గేట్లు ఎత్తి 3500క్యూసెక్కుల ఔట్‌ఫ్లోని కొనసాగించారు. కాగా 24వేల ఆయకట్టు, 1.24టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యం, 286.5 మీటర్ల ఎఫ్‌ఆర్‌ఎల్‌ కలిగిన సాత్నాల ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 284.60మీటర్ల ఎత్తులో 0.824 టీఎంసీ నీటి నిల్వలు ఉండగా, ఇంకా 960క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

గుండెపోటుతో యువకుడి మృతి



నవీన్‌ (ఫైల్‌)

తలమడుగు: మండలంలోని ఉండం గ్రామానికి చెందిన బోండ్ల నవీన్‌ (23) గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాలు ప్రకారం... నవీన్‌ డిగ్రీ పూర్తిచేశాడు. మంగళవారం ఉదయం ఇంట్లో ఒక్కసారిగా కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఉన్న ఒక కుమారుడు మృతిచెందడంతో కుటుంబబీకుల రోదనలు మిన్నంటాయి.